# నిశ్చల నిశీధి

నిండు పున్నమి...

నదిలో నీళ్ళు చంద్రుడి ఎరుపుదనాన్ని అద్దుకొని పారాణి పూసుకున్న పెళ్ళి కూతురులా మెరిసి పోతున్నాయి. అలలు అలలుగా నీళ్ళు కదులుతుంటే జుమ్ మ్.... అన్న శబ్దంతో నీరసంగా కదుల్తోంది లాంచి.

ఈ దేశంలో ఏ ఆడదానికైనా జీవితాంతం గుర్తుండేది మొదటిరాత్రి.

పాలు అందించి...దీపాలుదించి ఇరుకుగదుల్లో శరీరాన్ని పంచుకోవడం కాకుండా మా మొదటి రాత్రి ఇలా లాంచి మీద...చుట్టూ చల్లటి ప్రకృతి ...వెచ్చటి వెన్నెల... తెల్లటి సిల్కు బట్టల్లో ఆయన....

సీతా అన్నారాయన సౌమ్యంగా నాపై చెయ్యివేస్తూ ... నిజం చెప్పొద్దూ నాకు సిగ్గు ముంచుకొచ్చింది. పెళ్ళికి ముందు కొంత పరిచయమైనా.... ఇప్పుడాయన కళ్ళలోకి చూడాలంటే సిగ్గుగా ఉంది.

లాంచి మీద పరిచిన మల్లెలు గాలితెమ్మెరలకు కదులుతున్నాయి.

'సీతా... సీతారాముల్లా అన్యోన్యంగా ఉండాలి మన దాంపత్యం' అన్నారాయన.

'వాళ్ళలాగే మనమూ ప్రతి ఏటా వైభవంగా పెళ్ళి చేసుకుందామా?' నాలోని విడియం ఏంమాట్లాడిందో నాకే తెలియదు. "ప్రతి ఏటా మీ నాన్న కట్నమిస్తే చేసుకోవడానికి నాకేం అభ్యంతరం లేదు నవ్వుతూ అన్నారు శ్రీవారు.

నేను బుంగమూతిపెట్టాను.

అవున్నూ, సీతారాముల కళ్యాణం రేడియోలో ప్రసారం చేస్తారు కదోయ్.... మరి ఫస్ట్‌నైట్‌నీ' చప్పున ఆయన నోరు మూసాను.

అదిగో... అక్కడే మొదలైంది.

నా చేతిని అలాగే ముద్దాడుతుంటే... మైకంగా కళ్ళు మూసుకున్నాను.

ఆకాశం పర్శిస్తే పుడమి పులకించినట్టు.... స్పర్శ పంధొమ్మిదేళ్ళ వసంతంలో శిఖరంలా పెరిగిన కలలు అ స్పర్శకు క్రొవ్వొత్తిలా కరుగుతున్నాయి. నా మెడ వంపులో చిక్కుకున్న ఆయన ముఖంలోని గరుకు గడ్డం గిలిగింతలు పెడితే కిలకిలా నవ్వాను. నా నవ్వు ఆ నదిలో ప్రతిధ్వనించి ఉంటుంది.

"నేనుకూడా టెన్సింగ్ నార్కేలా హిమాలయాల మీద జెండా ఎగరేయబోతున్నాను" కిందికి జారుతూ చెవిలో చెప్పిన గుసగుసకి సిగ్గుతో మరింత అదిమి పట్టుకున్నాను.

పట్టు చీర గరగరమంది. వెన్నెల సోనల్లో అమృతాన్ని కురిపిస్తున్నారాయన. చంద్రుడు సగం కోసిన పుచ్చకాయలా మారి ఆయనలాగే ఆకాశంపై ప్రాకుతున్నాడు. అరమోడ్పుల కన్నుల్లోంచి మత్తురాలిపడుతోంది.

"ఏయ్... ఇంకా ఎక్కడికి ?"

గుండెల్లో గిలిగింతలు పెడుతుంటే ఆ అనుభవాన్ని శరీరంలోని ప్రతి అణువులో పదిలపర్చుకుంటూ "వెల్‌కం మై డార్లింగ్...."అన్నాను. అంతే !

శివధనస్సులా వంగిన నడుం మీద ఆయన అధరాలు...

రెప్పపాటులోనే రెచ్చిపోతాడు మగాడు.

లాంచి పరిగెడుతోంది.

వెన్నెల వెలుగులుమరింత పరుచుకుంటున్నాయి... ఆయన చేతులు

నా శరీరంలోని అణువణువునీ శృతి చేస్తున్నాయి. స్త్రీ పురుషుల కలయిక మరింత మమతనీ, అనుబంధాన్ని పెంచుతుందని ఈ అనుభవంతో తెలుస్తోంది. పొంగి పొర్లుతున్న ప్రేమానురాగాలు.

సుఖతీరాలకు చేరువలో మైనంలా కరిగి మైదానంలా పరుచుకుంటే... మునిపంటితో కరుచుకొంటూ ఆక్రమించిన ఆ క్షణాన...

ఒక నిప్పురవ్వ శరీరాన్ని చేరువలో తాకి కంపించిపోయాను. ఆ వెంటనే భయంతో నేను వేసిన కేకకి నది కూడా నిశ్చలమై ఉంటుంది. దిగ్గున దూరంగా జరిగాను. ఆ వెన్నెల్లో నా శరీరం పాలరాతి శిల్పంలా మెరుస్తోంది. ఆ శిల్పంపై చిరు చెమటలు.

భయంతో కన్నీళ్ళు ఆగటం లేదు. ఆయన బిక్కచచ్చి పోయి చూస్తున్నారు.

'మీరు....మీరు సిగరెట్లు తాగుతారా?' నేనడిగిన ప్రశ్నకి ఆశ్చర్యంగా చూశారు.

కోరిక ఆవిరై పోతుంది. కొద్ది క్షణాల తర్వాత 'నా కసలు వక్కపొడి వేసుకునే అలవాటుకూడా లేదు' నిర్లిప్తంగా అన్నారు.

'ఆ...వక్కపొడి కూడా అలవాటు లేదా? మరి నా తొడమీద సిగరెట్‌తో కాల్చినట్టు....' స్వగతంలో గొణుక్కుంటూ... 'భ్రమ పడ్డానా ?' అనుకున్నాను. భయం కదలాడే కళ్ళతో ఆయన ముఖంలోకి చూడలేక నీళ్ళలోకి చూసి ఉలిక్కిపడ్డాను...

నీళ్ళలో తెల్లగా కొట్టుకు పోతోంది. ఏమిటది? శవమా ? సన్నంగా ఏడుపు విన్పిస్తోంది...ఎవరిదది ? అక్కయ్యదా ? అక్కా !!!!!

భయంతో ముడుచుకు పోయాను. మా మధ్య నిలిచిన నిశ్శబ్దాన్ని లాంచి చప్పుడు భయంకరంగా అణచి వేస్తోంది.

నిర్వీర్యంగా మారిన మొదటి రాత్రి.... ఆ రాత్రి కదలటం లేదు.

చాలా సేపటికి ఆయన చేయిపడి ముందు ఉలిక్కి పడి.... తర్వాత సర్దుకున్నాను.

ఏమైంది సీతా... ఇలా మారిపోయావే ?

భయంగా చుట్టూ చూశాను. శవం కన్పించలేదు...

ఏడ్పు విన్పించలేదు.

'నా సిల్కు లాల్చీ నీళ్ళల్లో పడి కొట్టుకుపోయింది'

ఆ మాటకు మనసు స్థిమిత పడింది.' భ్రమ పడ్డానేమో' అనుకున్నాను.

'అవును భ్రమే. ఖచ్చితంగా భ్రమ పడ్డాను. ఎందుకిలా జరిగింది ? అవును ! అక్కయ్య ఇంటికొచ్చినప్పుడల్లా బావగారి రాక్షస రతికి నిదర్శనంగా మిగిలిన మచ్చల్ని చూపిస్తూ కొన్ని రోజులుగా...ఏడ్వటం....

ఏడ్చి ఏడ్చి ఆ కాల్పులు భరించలేక ఇదే నదిలో....ఓ వెన్నెల రాత్రి మల్లెపూలతో తెల్ల చీరలో శవంగా తేలటం....ఆ భయంకర వాస్తవాన్ని తట్టుకోలేక అనుక్షణం ఆ వేదనలో గడిపి...అలాంటి అనుభవం పొందుతూ భ్రమ పడ్డానా ?'

తల విదిలించాను. ఈ కదలని రాత్రిలో కదిలించే ఆ కథని ఈయనకెలా చెప్పను ? ?

ఆయనింకా చిత్రంగా నా మొహంలోకే చూస్తున్నారు. నా మీద నాకే అసహ్యం వేసింది.

'భ్రమ పడ్డావా ?'

'భయపడ్డారా ?' ఎదురు ప్రశ్న వేసాను.

ఆయన మాట్లాడలేదు. నీళ్ళలోకి చూస్తూ కూచున్నారు. ఆ కల లోంచి సెటప్ అయ్యే సరికి మరో అరగంట గడిచింది. దోసెడు మల్లెలు తీసుకొని ఆయన్ని అభిషేకిస్తూ వెన్నెలకంటె మత్తుగా నవ్వాను. "ఐ పిటీ యూ డియర్"

ఒక గాలి తెమ్మెర మళ్ళీ కోర్కె రేపింది. కాని ఆ పాటికే భానుడి తాలూకు వెలుగురేకలేవో తొలి కోడికి సందేశాన్నందించాలని వస్తున్నాయి.

అయినా కొత్త పెళ్ళికొడుకు పొద్దెరుగుతాడా.... ??

★